



కొండపల్లి పాఠశాల సమీపంలో సంచరిస్తున్న ఎలుగుబంటి

## పాఠశాల వద్ద ఎలుగుబంటి హల్‌చల్

**వజ్రపుకొత్తూరు, ఫిబ్రవరి 7:** మండలంలోని కొండపల్లి ప్రాథమిక పాఠశాల వద్ద బుధవారం మధ్యాహ్నం ఎలుగుబంటి హల్‌చల్ చేసింది. పాఠశాలలో తరగతులు జరుగుతున్న సమయంలో అటుగా ఎలుగుబంటి రావడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు గట్టిగా కేకలు వేశారు. దీంతో పక్కనే ఉన్న తోటల్లోకి భల్లూకం వెళ్లిపోవడంతో వారంతా ఊపిరిపీల్చుకున్నారు. కాగా, ఇటీవల ఈ గ్రామ సమీపంలో డెప్పూరు, గడూరుకు చెందిన నలుగురు వ్యక్తులపై రెండు ఎలుగు బంట్లు దాడి చేశాయి. ఈ ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడి విశాఖపట్నంలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం పాఠశాల వద్దకు ఎలుగుబంటి రావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఉదయం మంచు.. మధ్యాహ్నం ఎండ

జిల్లాలో విభిన్న వాతావరణ పరిస్థితులు



ఇచ్ఛాపురం పట్టణంలో ఉదయం 10 గంటలకు కురుస్తున్న మంచు

**ఇచ్ఛాపురం/రూరల్, ఫిబ్రవరి 7**

జిల్లాలో విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం వేళల్లో దట్టంగా పొగమంచు కురుస్తుండగా.. మధ్యాహ్నం వేళ ఎండ దారెత్తిస్తోంది. ఒక్కసారిగా మారిన ఈ వాతావరణంతో జిల్లావాసులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాను కొద్దిరోజులుగా మంచు దుప్పటి కప్పేస్తోంది. ఉదయం 10 గంటల వరకు ఇదే పరిస్థితి. దీంతో రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు సైతం కనిపించడం లేదు. వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఓ మోస్తరుగా చలి కూడా ఉండడంతో చిన్నారులు, వృద్ధులు ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నారు. సామాన్యులు సైతం తెల్లవారుజామున వాకింగ్ చేయలేని పరిస్థితి. జీడి, మామిడి, అపరాలు, వాణిజ్య పంటలపైనా పొగమంచు ప్రభావం పడుతోంది. ఉదయం పది గంటల తర్వాత మాత్రం సీన్ మారుతోంది. మెల్లగా పొగమంచు తొలగిపోగా.. భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. వాస్తవంగా ఏటా రథసప్తమి, మహాశివరాత్రి తర్వాత ఉష్ణోగ్రతలు పెరుగుతుంటాయి. అయితే ఈఏడాది మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది.



ఎండ తీవ్రతకు శ్రీకాకుళం ఏడు రోడ్ల కూడలి వద్ద జన సంచారం లేని దృశ్యం


## దగా డీఎస్సీ మాకొద్దు

● అప్రెంటీస్ విధానం రద్దు చేయాల్సిందే ● కలెక్టరేట్ వద్ద ఏఐవైఎఫ్ ధర్నా

**కలెక్టరేట్, ఫిబ్రవరి 7:** 'నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో ముఖ్యమంత్రి జగన్మోహ న్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారు. ఇప్పుడు ఎన్నికల సమయంలో మెగా డీఎస్సీ అని మరోసారి నిరుద్యోగులను మోసం చేస్తున్నారు. ఈ దగా డీఎస్సీ మాకొద్దు' అని ఏఐవైఎఫ్ నాయకులు అన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్నా శ్రీనివాసరావు, జనసేన నాయకుడు పల్లి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. మెగా డీఎస్సీ అని గత ఎన్నికల సమయంలో నిరుద్యోగులను ఊరించి జగన్ మోసం చేశారని అన్నారు. ఇప్పుడు అప్రెంటీస్ విధానం తీసుకువచ్చి నిలువునా ముంచేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు 25వేల ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నాయని చెప్పిన సీఎం నాలుగున్నరేళ్ల తరువాత కేవలం 6,100 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం దారుణమన్నారు. ఐదేళ్లుగా నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లలో, హాస్టళ్లలో ఉంటూ డీఎస్సీ కోసం సిద్ధమవుతున్నారని, వారి శ్రమ, విలువైన కాలం వృథా అయిందని ధ్వజమెత్తారు. మెగా డీఎస్సీ ఇవ్వకపోతే రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగ యువతతో కలిసి ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏఐవై ఎఫ్ నాయకులు అరుగుల రాము, అరవింద్, కర్ణవీరుడు, తులసీరావు, వెలమల రాము, సాయి దిలీప్, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు



# బడ్జెట్‌లో జిల్లాకు నిరాశ

● ఏమిస్తారనే దానిపై స్పష్టత కరువు

● పాత ప్రాజెక్టులకు కేటాయించని నిధులు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

బడ్జెట్ ఈసారి కూడా నిరాశనే మిగిల్చింది. జిల్లాకు కనీస స్థాయిలో కేటాయింపులు లేవు. కొత్తవి తేలేదు.. ఉన్న వాటికి నిధులివ్వ లేదు. ఇప్పటికే అమలు చేసిన పథకాలు.. వాటికి ఖర్చు చేసిన గణాంకాలను వెల్లడించేందుకే ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ప్రాధాన్యం ఇచ్చారు. అసెంబ్లీలో బుధవారం రూ.2,86,389 కోట్ల అంచనాతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. ఈ నాలున్నరేళ్లుగా ఖర్చు చేసిన గణాంకాలనే వివరించారు.

### నిధులు ఇప్పట్లో లేవు..

జిల్లాలో వంశధార నదిపై 1977లో గొట్టా బ్యారేజీ నిర్మించారు. ఎడమ ప్రధాన కాలువ ద్వారా 1,48,230 ఎకరాలు, కుడి ప్రధాన కాలువ ద్వారా 62,280 ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతోంది. ఎడమ కాలువ ఆధునికీకరణకు రూ.954 కోట్లు అవసరమని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అయితే ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను కేవలం రూ.3.89 కోట్లు కేటాయించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ. 23 కోట్లు అవసరమని బడ్జెట్ ప్రతిపాదనలు అధికారులు పంపారు. ఈ నిధులు మంజూరు కాలేదు. అలాగే కుడిప్రధాన కాలువ సీసీ లైనింగ్ కోసం రూ.22.88 కోట్ల అంచనాలతో అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కానీ ఎలాంటి నిధులు మంజూరు చేయలేదు.

● ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌కు సంబంధించి రూ.7.52 కోట్లు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. భూసేకరణకు రూ.7.04 కోట్లు బిల్లులు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను భూసేకరణ, ఆర్‌అండ్‌ఆర్ కలిపి రూ.9.35 కోట్లు కేటాయించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.116 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఈ నిధుల సంగతి ఎటూతేలలేదు.

● హిరమండలం ఎత్తిపోతల పథకం పనులకు, వంశధార ప్రాజెక్టు రెండో దశ రెండో విభాగానికి రూ.110 కోట్లు బడ్జెట్‌లో కేటాయించారు. ఈ నిధులు సగం మేర విడుదల కాలేదు. ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.360 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు. ఈ నిధుల విషయాన్ని ప్రభుత్వం మరిచింది. కేవలం వంశధార ఫేజ్-2 పనులకు సంబంధించి, నదుల అనుసంధానం ఇలా వీటన్నింటికీ ఈ ఆర్థిక సంవత్సరానికే రూ.360 కోట్లు అవసరం. బిల్లులు రూ.41కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇంకా రూ.20కోట్లు బిల్లులకు అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఈ ఆర్థిక సంవత్సరానికి అవసరమైన బడ్జెట్‌లో ఎటువంటి కేటాయింపులు లేవు. పైగా గతేడాది బడ్జెట్‌లో కేటాయించిన నిధుల్లో సగం మేర విడుదల చేయలేదు. బిల్లులు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై అన్ని వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# ఈసారి 113 కిలోలు..!

● ఆగని గంజాయి అక్రమ రవాణా ● పలాస, ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్లలో స్వాధీనం

● ఐదుగురి అరెస్టు ● మూడు రోజుల్లో 165 కేజీల సీజ్



రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు, నిందితులు (ముసుగులో)



ఇచ్ఛాపురంలో పట్టుబడిన గంజాయి మూటలు..

**పలాస, ఫిబ్రవరి 7:** జిల్లాలోని రైల్వే స్టేషన్లలో గంజాయి అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. పోలీసులు వరుసగా దాడులు చేస్తున్నా గంజాయి రవాణా మాత్రం ఆగడం లేదు. మూడు రోజుల్లో పలాస, ఇచ్ఛాపురం స్టేషన్లలో 165 కిలోల గంజాయిని పోలీసులు సీజ్ చేశారు. పలాస రైల్వే స్టేషన్‌లో గత రెండు రోజుల్లో 52 కేజీల గంజాయి పట్టుబడగా తాజాగా బుధవారం 41 కిలోలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ వెంకటరావు కథనం ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన ఆకాశ్‌కుమార్, ప్రేమజిత్‌కుమార్ ఒడిశా రాష్ట్రం ఆర్.ఉదయగిరి ప్రాంతంలో 41 కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. ఈ గంజాయిని 19 ప్యాకెట్లుగా కట్టి లగేజీ బ్యాగుల్లో పెట్టారు. ఈ బ్యాగులను పట్టుకొని బుధవారం పలాస రైల్వే స్టేషన్‌కు వచ్చారు. సికింద్రాబాద్‌కు వెళ్లేందుకు టిక్కెట్లు తీసుకున్నారు. వారు అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో మఫ్టీలో ఉన్న రైల్వే పోలీసులు వారిని ప్రశ్నించారు. దీంతో బ్యాగులు విడిచి పరారయ్యేందుకు ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు వారిని చాకచక్యంగా పట్టుకున్నారు. బ్యాగులను చూడగా గంజాయి కనిపించింది. నిందితులను ప్రశ్నించగా.. తాము కేవలం బ్రోకర్లమేనని, కిలో గంజాయి రూ.5వేలకు కొనుగోలు చేశామని, సరుకును సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద మరో బ్యాచ్‌కు అప్పగించడం వరకే తమ పని అని వివరించారు. అసలు సూత్రధారుల కోసం ఆరా తీయగా వారి నుంచి ఎటువంటి సమాధానం రాలేదు. కేవలం ఫోన్ ఆధారంగానే తాము సరకు చేరవేస్తామని, అసలు వ్యక్తులు తమకు తెలియదని చెప్పారు. ఈ మేరకు వారిద్దరిని అరెస్టు చేశామని, విశాఖ పట్నం రైల్వే కోర్టులో హాజరుపరుస్తామని సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

**ఇచ్ఛాపురంలో..**

**ఇచ్ఛాపురం:** ఒడిశా రాష్ట్రం బరంపురం నుంచి ఇచ్ఛాపురం మీదుగా పూణేకు బుధవారం రైలులో తరలించేందుకు సిద్ధం చేసిన 72 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం రావడంతో సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు, పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ వద్ద తనిఖీలు చేపట్టారు. స్టేషన్ సమీపంలోని చిదంబరేశ్వర ఆలయం వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ఒడిశాకు చెందిన ఇద్దరు మహిళలతో పాటు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న బ్యాగులను తనిఖీ చేయగా 72 కిలోల గంజాయి బయటపడింది. బరంపురంలో గంజాయిని కొనుగోలు చేసినట్లు వారు చెప్పారు. ఈ ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## బీఎస్ఎఫ్ జవాన్ అనుమానాస్పద మృతి

● మాల్దా రైలు పట్టాలపై మృతదేహం



రాము (ఫైల్)

**టెక్కలి రూరల్, ఫిబ్రవరి 7:** మండలంలోని గూడెం గ్రామానికి చెందిన బీఎస్ఎఫ్ జవాన్ పిట్ట రాము (35) బుధవారం పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మాల్దా రైల్వే ట్రాక్‌పై అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. గ్రామస్థుల వివరాల మేరకు.. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రాము ఈ నెల 6వ తేదీన సెలవుపై ఇంటికి వచ్చేందుకు బయలుదేరాడు. ఈ క్రమంలో బుధవారం మాల్దా సమీపంలోని రైల్వే ట్రాక్‌పై మృతిచెంది కనిపించాడు. ఈ మేరకు రైల్వే సిబ్బంది బీఎస్ఎఫ్ అధికారులకు సమాచారం అందించారు. వారు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని వద్ద మాల్దా ప్రాంతం నుంచి పలాసకు వచ్చే రైల్వే టికెట్, బీఎస్ఎఫ్ గుర్తింపు కార్డు, ఆధార్, ఓటరు, తదితర గుర్తింపు కార్డులు లభ్యమయ్యాయి. దీంతో మృతి చెందింది రాముగా గుర్తించి గూడెంలోని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అయితే, రైలుపట్టాలపై రాము మృతదేహం రెండు భాగాలుగా విడిపోయి ఉండడంతో బీఎస్ఎఫ్ కమాండో ఉన్నతాధికారులు అనుమానాస్పద మృతిగా పేర్కొన్నారు. రాము ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనే అనుమానాలు గ్రామంలో వ్యక్తం అవుతున్నాయి. మృతదేహాన్ని గురువారం నాటికి గ్రామానికి తీసుకువచ్చేందుకు బీఎస్ఎఫ్ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. రాముకు భార్య సుజాత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. జవాన్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

# ఆశా కార్యకర్తల నిర్బంధం

● విజయవాడకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు

● నోటీసులు అందించి స్టేషన్‌కు తరలింపు



సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్‌లో..



ఆమదాలవలస మండలం బొబ్బిలిపేట ఆశా కార్యకర్తకు నోటీసు అందిస్తున్న పోలీసులు

**నందిగాం/సరుబుజ్జిలి/హిరమండలం, ఫిబ్రవరి 7:** జిల్లాలోని ఆశా కార్యకర్తలను పోలీసులు నిర్బంధించారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం గురువారం తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి వారిని వెళ్లనీయకుండా పోలీసు లు ముందస్తుగా అడ్డుకున్నారు. బుధవారం ఆశా కార్యకర్తల ఇళ్లకు వెళ్లి నోటీసులు ఇచ్చి నిర్బంధించారు. పలువురిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నందిగాం మండలంలోని పాలవలస, జడ్యాడ, నందిగాం, సరుబుజ్జిలి మండలంలోని ఏఎల్ నగరం, నందికొండ, ఆమదాలవలస మండలంలోని బొబ్బిలిపేట, తదితర గ్రామాలకు చెందిన ఆశా కార్యకర్తలకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. సరుబుజ్జిలి, ఎల్ఎన్‌పేట మండలాలకు చెందిన ఆశ కార్యకర్తలను సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వరకు నిర్బంధించి అనంతరం పూచీకత్తులతో విడిచిపెట్టారు. హిరమండలం ఆశా కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌లో కొంత సమయం ఉంచారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ.. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తుంటే పోలీసులు తమను అడ్డుకోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. పనిభారం తగ్గించాలని, వేతనాలు పెంచాలని, అధికారుల ఒత్తిడి లేకుండా చూడాలని, యాప్‌ల భారం నుంచి కొంతమేర ఉపశమనం ఇవ్వాలని, సెలవులు కేటాయించాలని డిమాండ్ చేశారు.



హిరమండలం పోలీసు స్టేషన్‌లో..



నందిగాం: పోలీస్‌స్టేషన్ వద్ద..

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వంతో ప్రజలకు, గ్రామాలకు ఒరిగిందేమీ లేదని పలువురు టీడీపీ నేతలు అన్నారు. పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు బుధవారం గ్రామాల్లో బాబు ష్యూరిటీ, పల్లె పల్లెకు టీడీపీ కార్యక్రమాలు నిర్వహించారు.

# వైసీపీతో ఒరిగిందేమీలేదు

## టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి



జలుమూరు: టెక్కలిపాడులో టీడీపీ జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

**జలుమూరు:** టీడీపీ ప్రభుత్వంతోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బుధవారం టెక్కలిపాడులో బాబుష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వైసీపీ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి కానరాలేదన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించి చంద్రబాబును మళ్లీ సీఎంగా చేయాలని కోరారు. అనంతరం గ్రామంలో టీడీపీ జెండాను ఆవిష్క రించారు. కార్యక్రమంలో నేతలు వెలమల రాజేంద్రనాయుడు, బగ్గు గోవిందరావు, పిరియా వెంట్రావు, తాన్ని అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ పాలనలో ఒరిగిందేమీలేదు



కోటబొమ్మాళి: మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

**కోటబొమ్మాళి:** రాష్ట్రంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో గ్రామాలకు ఒరిగిందేమీలేదని టీడీపీ మండల అధ్యక్షుడు బోయిన రమేష్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, మాజీ ఎంపీపీలు వెలమల విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ అన్నారు. బుధవారం కిష్టుపురం, చౌదరికొత్తూరు తదితర గ్రామాల్లో టెక్కలి నియోజకవర్గ జనసేన నాయకులు పల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులతో కలిసి పర్యటించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించేలా ప్రతీ కార్యకర్త, నాయకుడు సమష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు పూజారి శైలజ, బాడాన రమణమ్మ, వాన లక్ష్మి, దేవాది సింహాద్రి, జెండి అన్న పూర్ణ, నర్సింగరావు, నంబాళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. రామే శ్వరంలో భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఏఎంసీ మాజీ చైర్మన్ వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రాభివృద్ధి టీడీపీతోనే సాధ్యం



వజ్రపుకొత్తూరు: పూండి-గోవిందపురంలో పల్లె పల్లెకు టీడీపీలో పాల్గొన్న నాయకులు

**వజ్రపుకొత్తూరు:** టీడీపీ ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, క్లస్టర్ ఇన్‌చార్జి పుచ్చ ఈశ్వరరావు అన్నారు. బెండి, నువ్వలరేవు, పూండ గోవిందపురం లో పల్లె పల్లెకు టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్య క్రమంలో నాయకులు కణితి సురేష్, పోతనపల్లి సాంబమూర్తి, మరడ, దుర్యోధనరెడ్డి, అర్జవెళ్లి ఉమామహేశ్వరరావు, కర్ని రమణ, గోవిందు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ మాటలు నీటిమీద రాతలు



టెక్కలి: జెండాపేటలో బాబు ష్యూరిటీ నిర్వహిస్తున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు

**టెక్కలి:** వైసీపీ మాటలు నీటి మీద రాతలని టీడీపీ అధ్యక్షుడు బగాది శేషగిరి అన్నారు. బుధవారం జెండాపేట, సింగుమహంతిపేట గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహించారు. ఇచ్చిన హామీలు అమలు చేయని వైసీపీ ప్రభుత్వ మాయమాటలను ఎవరు నమ్మవద్దన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమిని గెలిపించాలని కోరారు. టీడీపీ అధినేత చంద్రబాబును మళ్లీ సీఎంగా చేయాలని కోరారు. కార్యక్రమంలో హనుమంతు రామకృష్ణ, మామిడి రాము, పోలాకి షన్ముఖరావు, మెండ దమయంతి, పరపటి చిన్నయ్యరెడ్డి, దల్లి ప్రసాద్ రెడ్డి, బలగ భీమారావు, ఇప్పిలి జగదీష్, చంద్రరావు, సందీప్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## సూపర్‌సిక్స్ అంశాలపై అవగాహన



కొత్తూరు: కరప్రతాలు పంపిణీ చేస్తున్న సాగర్

**కొత్తూరు:** కొత్తూరులోని పలు వీధుల్లో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వమించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు పాలొన్నారు.

## బాబుతోనే భవిష్యత్



కవిటి:కరాపాడులో కరపత్రాలు అందిస్తున్న టీడీపీ నాయకులు

**కవిటి:** రాష్ట్రానికి చంద్రబాబుతోనే భవిష్యత్ ఉంటుందని టీడీపీ మండలాధ్యక్షుడు మణిచంద్ర ప్రకాష్ తెలిపారు. బుధవారం కరాపాడులో భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయ కులు సీపాన వెంకట రమణ, పురుషోత్తం, బాలయ్య, వెంకట్రావు, సునీల్, గంగారావు, బాలకృష్ణలు పాల్గొన్నారు.

## బి.కంచరాంలో..



బాబు ష్యూరిటీలో పాల్గొన్న నాయకులు

**పొందూరు:** బి.కంచరాం, లోలుగు గ్రామాల్లో టీడీపీ మండలాధ్యక్షుడు సీహెచ్ రామ్మోహన్, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శంకరభాస్కర్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైసీపీకి కౌంట్‌డౌన్ ప్రారంభం

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష
- పెసరపాడులో వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో గౌతు శిరీష

**కాశీబుగ్గ, ఫిబ్రవరి 7:** రాష్ట్రంలో సాగుతున్న రాక్షసపాలనపై పలాస నియోజకవర్గంలో అన్ని పంచాయతీలు, మునిసిపల్ వార్డుల్లోని వైసీపీ నాయకులు విసుగు చెంది టీడీపీలో చేరుతున్నారని, దీంతోనే వైసీపీకి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. బుధవారం పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ పరిధి 6వ వార్డు అంతరకుడ్డ, పెసరపాడులో పల్లె పల్లెకు టీడీపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కి మళ్లి పోయిందని విమర్శించారు. ప్రజలందరూ అంధకారంలో ఉన్నారని, మళ్లీ వెలుగులు కావాలంటే టీడీపీని గెలిపించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని ఆదరించి అధినేత చంద్రబాబును మళ్లీ సీఎంగా చేయాలని కోరారు. పలాసలో అక్రమాలు, భూదందాలు, దాడులు పెరిగిపోవడంతో ప్రజలందరూ ఆలోచలో పడ్డారన్నారు. ఈ నేపథ్యంలోనే టీడీపీలోకి వలసలు భారీగా జరుగుతున్నాయన్నారు.

## పెసరపాడులో వైసీపీని వీడి టీడీపీలోకి...

పెసరపాడు గ్రామంలో మాజీ కౌన్సిలర్ సంపతిరావు ధనుంజయ్, రోణంకి కురమయ్య, రోణంకి మోహన్ రావు, రోణంకి రమేష్, కూర్మాపు మన్మథరావు, తిరుపతిరావు, అప్పారావు, పాపారావు, ధర్మపురి అప్పల స్వామి, పొన్నాడ జోగారావు తదితర వైసీపీ నేతలు టీడీపీలో చేరారు. వీరికి శిరీష పార్టీ కండువాలను వేసి ఆహ్వానిం చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, బీసీ సెల్ కార్యదర్శి లొడగల కామేశ్వరరావు యాదవ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, గాలి కృష్ణారావు, సూర్యనారాయణ, సప్ప నవీన్, రవి శంకర్ గుప్తా, శంకర్, రాంబాబు, ఆనంద్, శ్రీను, చిరంజీవి, సురేష్, వెంకటరమణ, సురేష్‌కుమార్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

## కీర్తిపురంలో...

**ఇచ్ఛాపురం రూరల్:** కీర్తిపురంలో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు లోపింటి పద్మనాభం మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం నవరత్నాలతో నవమోసాలకు పాల్పడిందని ఆరోపించారు. కార్యక్రమంలో కరగాన కృష్ణారావు, వలపల శ్రీకాంత్, కోటి, వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.



కీర్తిపురంలో భవిష్యత్‌కు గ్యారెంటీ నిర్వహిస్తున్న నాయకులు

## తొలగించిన పింఛన్లను పునరుద్ధరించండి

**పలాసరూరల్:** పలాస మండలం సరియాపల్లి గ్రామంలో కొందరు టీడీపీలో చేరారనే నెపంతో సామాజిక పింఛన్లను తొలగించారని, తక్షణం వాటిని పునరుద్ధరించాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయం ఎదుట బుధవారం నిరసన చేపట్టారు. టీడీపీలో చేరారనే సాకుతో పింఛన్లు, వైఎస్ఆర్ చేయూత, భరోసాలను నిలిపి వేశారని, దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఆమె తెలిపారు. అనంతరం ఎంపీడీవో మెట్ట వైకుంఠరావుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీరికట్ల విఠల్‌రావు, కుత్తుమ లక్ష్మణరావు, డి.సంతోష్‌కుమార్, సూర్యకృష్ణంరాజు, యాదగిరి, హోరియా మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆంజనేయ స్వామిని ప్రత్యేక పూజలు

**మందస:** పొందరవీధిలోని ఆంజనేయ స్వామి ఆలయ 4వ వార్షికోత్సవం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా విశేష కార్యక్రమాలు చేపట్టారు. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష స్వామిని దర్శించుకున్నారు. అర్చకులు ఆమెతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

**టెక్కలి:** లోక్‌అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని టెక్కలి ఇన్‌చార్జి జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత అన్నారు. బుధవారం కోర్టులో న్యాయవాదులు, బ్యాంకు సిబ్బంది, పోలీస్ అధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజీకి అనుకూలమైన అన్ని క్రిమినల్, సివిల్, ప్రీలిటిగేషన్ కేసులను ఇరు పార్టీల అంగీకారంతో పరిష్కరించుకోవచ్చ న్నారు. లోక్‌అదాలత్ తీర్పు అంతిమమని, ఈ అదా లత్‌లో సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజులు వాపసు ఇవ్వడం జరుగు తుందన్నారు. మార్చి 9న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద, ఏజీపీ కృష్ణారావు, ఏపీపీ హరి ప్రియ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రసన్నలత

## నులిపురుగుల మాత్రలు పంపిణీ చేయాలి

**పాతపట్నం:** నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని డీవార్మింగ్ డే నాడు చేపట్టాలని ఎంపీడీవో కె.వెంకన్నబాబు అన్నారు. ఈ మేరకు బుధవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలతో పాటు గ్రామాల్లో అవగాహన కలిగించి మాత్రలు వేయాలన్నారు. కార్యక్రమంలో గంగువాడ, బైదలాపురం పీహెచ్‌సీల వైద్యాధికారులు శివ, సదాశివ తదితరులు పాల్గొన్నారు.

## గొర్రెల కాపర్లు కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలి

**పలాసరూరల్:** గొర్రెలు, మేకల పెంపకం దారులు కొత్త సంఘాలను ఏర్పాటు చేయాలని ఆ ఫెడరేషన్ జిల్లా చైర్మన్ రాపాక చిన్నారావు యాదవ్ కోరారు. మాకన్నపల్లి గ్రామ పొలాల్లో ఉన్న గొర్రెల మందల క్షేత్రాలను బుధవారం సందర్శించారు. 50 ఏళ్లకు పింఛన్, మంచు, వర్షానికి టెంట్లు, నెట్లు, అల్యూమినియం కొయ్యలు, టార్పాలిన్లు, రగ్గులు అందించేందుకు ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. సర్పంచ్ సైని దేశయ్య, గొర్రెల కాపర్లు దాసరి బారికయ్య, ఆదినారాయణ పాల్గొన్నారు.

## సబ్ కలెక్టర్ పర్యటన

**హిరమండలం:** పలు గ్రామాల్లో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ బుధవారం పర్యటించారు. చొర్లంగి గ్రామం వద్ద వ్యవసాయ భూమిని వాణిజ్య భూమిగా మార్పిడి చేసే దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పింద్రవాడ వద్ద రబీ జొన్న పంట ఈ క్రాప్ నమోదును పరిశీలించారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీటీ వెంకటరావు, సర్వేయర్ శ్యామలరావు పాల్గొన్నారు.

## రూ.1.40 లక్షలకు జీడితోట వేలం ఖరారు

**పోలాకి:** కోడూరు గ్రామంలో పోలాకి మండల పరిషత్‌కు చెందిన ఉన్న జీడితోట వేలం పాట ఖరారు చేసినట్లు ఎంపీడీవో కె.ఉషశ్రీ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా 22 మంది పాటదారులు పాల్గొన్నారు. సర్కారు పాట రూ.1.20 లక్షలుగా ప్రకటించగా ప్రకాశరావు పేటకు చెందిన చింతాడ ఉమామహేశ్వరరావు రూ1.40 లక్షలకు పాడి పాట దక్కించుకున్నారన్నారు. కార్యక్రమంలో ఉరజాం సర్పంచ్ కణితి సత్తిబాబు, సూపరింటెండెంట్ బలగప్రకాష్, ముద్దాడ బైరాగినాయుడు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు పెంచండి

**వజ్రపుకొత్తూరు:** పీహెచ్‌సీలో ప్రసవాలను పెంచాలని, ఈ దిశగా గర్భిణులకు అవగాహన కలిగించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఎం.ప్రసాదరావు అన్నారు. బుధవారం వెంకటాపురం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అమలవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై వివరాలు సేకరించారు. నూతనంగా నిర్మించిన భవనంలో అన్ని సదుపాయాలతో మరింత సేవలు అందించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వైద్యులు అంజలి, దేవి, అధికారులు సురేష్‌కుమార్, వెంకటరావు, అనూరాధ పాల్గొన్నారు.

## పీహెచ్‌సీల పనితీరు మెరుగుపడాలి

**నరసన్నపేట:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు మెరుగుపడాలని ఎంపీపీ ఆరంగి మురళి సూచించారు. బుధవారం మాకివలస పీహెచ్‌సీ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజ లకు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండి సేవలందించాలన్నారు. ఈవోపీఆర్డీ రామకృష్ణ, డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

## యూటీఎఫ్ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు

**టెక్కలి:** యూటీఎఫ్ ఆధ్వర్యంలో 'కులగణన-సామాజిక న్యాయం' అనే అంశంపై బుధవారం స్థానిక మెయిన్ ప్రాథమిక పాఠశాలలో శిక్షణా తరగతులు నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ కురమాన దాలయ్య, టి.వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

## జీడి రైతులను ఆదుకునేందుకు ప్రతిపాదనలు రాలేదు

- ఎంపీ రామ్మోహన్‌నాయుడు ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ మంత్రి సమాధానం
- వైసీపీ ప్రభుత్వంపై ఎంపీ ధ్వజం



**పలాస, ఫిబ్రవరి 7:** ఉద్దానం జీడి రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యమని, కనీసం వారి కోసం ఒక్క ప్రతిపాదన కూడా తీసుకొని రాలేదని కేంద్ర వ్యవసాయశాఖా మంత్రి మానసుఖ్ మాండవీయ ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు పార్లమెంట్‌లో వేసిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఈ మేరకు ఎంపీ ఒక ప్రకటన విడుదల చేస్తూ వైసీపీ ప్రభుత్వం జీడి రైతులపై వ్యవహరిస్తున్న తీరును పార్లమెంట్ సాక్షిగా ఎండగట్టారు. కేంద్ర మంత్రి లిఖితపూర్వకంగా సమాధాన మిచ్చారని, జీడి రైతు లను ఆదుకోవడం, దిగుమతి సుంకం పెంపు, జీడి పరిశోధన కేంద్రం ఏర్పాటుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి నివేదికలు అందలేదని మంత్రి స్పష్టం చేశారన్నారు. జిల్లాలో ఉద్దానం ప్రాంతంలో వేలాది ఎకరాల్లో జీడి పంటను రైతులు సాగు చేస్తున్నారని, పరిశ్రమలపై ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది కుటుంబాలు ఆధారపడి బతుకుతున్నాయన్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా ప్రతి ఏటా రైతులు పంటను నష్టపోవాల్సి వస్తోందని, గిట్టుబాటు ధర కోసం రైతులు దశాబ్దాలుగా పోరాటాలు చేస్తున్నా ఫలితం కనిపించడం లేదని, దీనిపై రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని కేంద్రం సహకారం తీసుకొని చర్యలు తీసుకోవాల్సి ఉండగా వైసీపీ ప్రభుత్వం మాత్రం ఉదాశీనంగా వ్యవహరించడంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జీడిపప్పు దిగుమతిపై సుంకాన్ని ఐదు శాతానికి పెంచాలని తాను ఇది వరకే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరానని, దీనివల్ల స్థానిక ఉత్పత్తిదారులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. పలాస ప్రాంతంలో జీడి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేసి సంబంధిత పంటపై సమగ్ర పరిశీలన చేసి పంట నష్ట నివారణ చేయవచ్చని, అదనపు ప్రోత్సాహకాల ద్వారా పరిశ్రమలు ఆదుకోవచ్చని ఉదహరించారు. ఇప్పటికైనా వైసీపీ ప్రభుత్వం రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని జీడి రైతుల సంక్షేమానికి కృషి చేయాలని ఎంపీ డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ఎంపీ ఉద్దానం జీడి రైతులను ఆదుకునేందుకు పార్లమెంట్‌లో ప్రస్తావించడాన్ని రైతులు స్వాగతిస్తున్నారు. ఇప్పటికైనా ఈ సమస్య పరిష్కారం దిశగా వెళ్తుందన్న ఆశాభావాన్ని రైతులు వ్యక్తం చేస్తున్నారు.

## దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

**కొత్తూరు:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 16న దేశ వ్యాప్తంగా చేపడుతున్న సమ్మెను విజయవంతం చేయాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శిర్ల ప్రసాద్ కోరారు. బుధవారం ప్రజా సంఘాల ఆధ్వ ర్యంలో సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థ లను పూర్తిగా ప్రైవేటుపరం చేసిందని విమర్శించారు. ఏళ్ల తరబడి కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను రద్దు చేసి కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. ఈ నేపథ్యంలో చేపడుతున్న సమ్మెను జయప్రదం చేయాలన్నారు. దేశవ్యాప్త సమ్మెకు మద్దతుగా 16న కొత్తూరులో నిరసన ప్రదర్శన చేపడుతున్నామన్నారు.

## హమ్మయ్య.. నీరొచ్చింది

**మెళియాపుట్టి, ఫిబ్రవరి 7:** గేదెల పోలూరు గ్రామా నికి కొంతకాలంగా తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'బోరు తీశారు.. మోటార్ మరిచారు' శీర్షికతో కథనం వచ్చిన సంగతి తెలిసిందే. మంగళవారం ఇదే సమస్యపై దండకారణ్య లిబరేషన్ పార్టీ అధ్య క్షుడు సవర కుమార్ ఆధ్వర్యంలో గిరిజనులు ఎంపీడీవో కొండల రావును కలిసి వినతి పత్రం అందజేశారు. బుధవారం ఎంపీడీవో ఆదేశాలతో ఇంజినీరింగ్ సిబ్బంది బోరుకు మరమ్మతులు చేపట్టి, మోటార్ ఏర్పాటు చేసి నీటిని అందించారు. దీంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



బోరుకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

## అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

**టెక్కలి రూరల్:** రావివలస అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం టెక్కలి ఐసీడీఎస్ అధికారులు తనిఖీ చేశారు. గత నెల 30న టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయం స్పందనలో గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేంద్రాన్ని సెక్టార్ సూపర్‌వైజర్ సంధ్యారాణి సందర్శించారు. సమయపాలన పాటించడం లేదని, ప్రీస్కూల్ విద్య సక్రమంగా అమలు కావడం లేదని, కేంద్రంలో వండిన పౌష్టికా హారం నాణ్యతగా లేదని లబ్ధిదారులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సూపర్‌వైజర్ తనిఖీ చేసి రికార్డులు, సరుకుల వివరాలను నమోదు చేసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

## ఆశా వర్కర్ల అరెస్ట్ అప్రజాస్వామికం

**వజ్రపుకొత్తూరు:** సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా పోరాటం చేస్తున్న ఆశా వర్కర్లను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమని సీఐటీయూ జిల్లా నాయకుడు నెయ్యిల మోహనరావు అన్నారు. గురువారం తమ సమస్యలను ప్రభుత్వానికి చెప్పడానికి వెళుతున్న ఆశా వర్కర్లు బి.లక్ష్మి, ఇప్పిలి నిర్మల, సావిత్రి రాము లమ్మను అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీల అమలు చేయాలనే వారు పోరాటం చేస్తున్నారు. తక్షణం వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్.చంద్రయ్య, కెవెంకటరావు, బి.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.




## దుకాణాలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**టెక్కలి:** టెక్కలి డివిజన్ పరిధిలోని అన్ని దుకాణాలు, సంస్థలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా చేయించాలని సహాయ కార్మికశాఖ కమిషనర్ జి.యల్లాజీరావు ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ లేకుంటే జరిమానా విధించడం జరుగుతుందన్నారు. రిజిస్ట్రేషన్ రెన్యువల్స్‌ను ఈనెలాఖరులోగా చేయించాలన్నారు. సమీపంలోని వార్డు, గ్రామ సచివాలయాలు, మీసేవ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించాలని యజమానులకు సూచించారు.

## గ్రానైట్ క్వారీ ఆపరేటర్ల సమ్మె విరమణ

**టెక్కలి:** వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏడురోజులుగా గ్రానైట్ క్వారీల ఎక్స్‌కవేటర్ల ఆపరేటర్లు చేస్తున్న సమ్మెను బుధవారం విరమించారు. ఉత్తరాంధ్ర గ్రానైట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుంకరి కృష్ణ, కార్యదర్శి హరి, చింతాడ గణపతి, అల్లు నగేష్ తదితరులు ఆందోళనకారులతో డీఎస్పీ బాల చంద్రారెడ్డి సమక్షంలో చర్చించారు. జీతభత్యాలు పెంపు, మెడికల్ అలవెన్స్‌లు, ఇన్సూరెన్స్ సౌకర్యంపై చర్చించారు. సమస్యల పరిష్కారానికి క్వారీల యజమానులు అంగీకరించడంతో విధుల్లో చేరేందుకు ఆపరేటర్లు అంగీకరించారు.

## పలు కుటుంబాలకు పరామర్శ

**సంతబొమ్మాళి:** సంతబొమ్మాళి పంచాయతీలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు మెండ దాసునాయుడు బుధవారం పరామర్శించారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయనతో మాజీ సర్పంచ్‌లు కూశెట్టి కాంతా రావు, మెండ అప్పారావు, స్థానిక నేతలు కూశెట్టి భానుప్రకాష్, పప్పు కృష్ణారావు, పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

**పలాసరూరల్:** లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమని ఆర్డీవో కార్యాలయ ఏవో జె.సూర్యనారాయణ అన్నారు. ఆర్డీవో కార్యాలయంలో బుధవారం వైద్యుల ఆధ్వర్యంలో పీసీపీఎన్‌డీటీ యాక్ట్-1994 చట్టం అమలుతీరుపై సమావేశం నిర్వహించారు. శారీరక, మానసిక హింసలు చేయరాదని, ఒకవేళ అటువంటి పరిస్థితులు ఎదురైతే 100 నెంబరుకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు గైతమి, దేవి, పాపినాయుడు, గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్, కోఆర్డినేటర్ సూర్యకళ, సిబ్బంది పాల్గొన్నారు.

## అన్ని వర్గాలకు అనుకూలంగా కేంద్ర పథకాలు

**టెక్కలి:** అన్ని వర్గాల ప్రజలకు అనుకూలంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని టెక్కలి నియోజకవర్గ బీజేపీ నాయకుడు అట్టాడ రవిబాబ్జీ అన్నారు. బుధవారం ఎన్టీఆర్ కాలనీలో పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీకి మరోసారి ప్రజల మద్దతు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నడుపూరు లక్ష్మీనారాయణ, అట్టాడ రాజేష్, పరమేష్, ధూపాన కామేశ్వరరెడ్డి, లింగరాజు తదితరులు పాల్గొన్నారు.

## బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

**పోలాకి:** తోటాడ మీదుగా గొల్లలవలస సచివాలయం వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి బుధవారం సర్పంచ్ జగన్మోహనరావు పనులను లాంఛనంగా ప్రారంభించారు. రూ.75 లక్షలతో రోడ్డు నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ముద్దాడ బైరాగినాయుడు తదితరులు పాల్గొన్నారు.






## ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

శ్రీకాకుళం క్రైం: రూరల్ మండలంలోని మునసబుపేట సమీపంలో జాతీయరహదారికి ఆనుకుని ఉన్న సర్వీసు రోడ్డుపై ఫుట్‌పాత్ ఆక్రమణలను హైవే అధికారులు తొలగించారు. ఫుట్‌పాత్ ఆక్రమణలపై జనవరి 28న హైవే ఫుట్‌పాత్ ఆక్రమణ శీర్షికతో కథనం ప్రచురితం కావడంతో హైవే అధికారులు స్పందించారు. ఈమేరకు ఫుట్‌పాత్‌ను ఆక్రమించుకుని కొందరు ఏర్పాటుచేసిన కంటైనర్లనుబుధవారం తొలగించారు. వారికి సంబంధించిన స్థలంలో వాటిని ఏర్పాటు చేసుకోవాలని సూచించడంతో ఫుట్‌పాత్‌పై ఉన్న కంటైనర్లను వారి స్థలంలోకి తరలించారు.



ఫుట్‌పాత్‌పై కంటైనర్లను తొలగించిన దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

## వ్యర్థాలు బయట వేస్తే లైసెన్స్‌లు రద్దు

● శ్రీకాకుళం నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ వెంకటరావు

శ్రీకాకుళం క్రైం: వ్యర్థాలను ఆరుబయట వేస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామని శ్రీకాకుళం నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ వెంకటరావు వ్యాపారులను హెచ్చరించారు. బార్ నిర్వాహకుల నిర్లక్ష్యంతో అపరిశుభ్రత నెలకొనడంపై ఆంధ్రజ్యోతిలో బుధవారం 'బారుబేజారు' శీర్షికతో కథనం ప్రచురితం కావడంతో నగరపాలక సంస్థ అధికారులు స్పందించారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని డే అండ్ నైట్ కూడలిలో పెట్రోల్‌బంక్ పక్కనఉన్న ఎస్‌బీ బార్‌అండ్ రెస్టారెంట్ పరిసరాలను నగరపాలక హెల్త్ ఆఫీసర్ వెంకటరావు పరిశీలించారు. ఆ ప్రాంతంలో బార్ నిర్వాహకులు ఖాళీ స్థలంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, మద్యం సీసాలు వేయడంతో పాటు నవీన్ అనే వ్యక్తికి సంబంధించిన స్క్రాప్ వ్యర్థాలు, అక్కడఉన్న మెస్‌కు సంబంధించిన ఆహార వ్యర్థాలు ఉన్నట్లు వెంకటరావు గుర్తించారు. సంబంధిత వ్యాపారులను పిలిపించి పారిశుధ్యానికి తూట్లు పొడుస్తున్న వ్యాపారుల లైసెన్స్‌లు రద్దు చేస్తామని, రూ.25వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. తొలితప్పుగా భావించి ఒక్క అవకాశం ఇవ్వాలని ఎంహెచ్‌వోకు వ్యాపారులు విజ్ఞప్తిచేశారు. రెండురోజుల్లో వ్యర్థాలు తొలగించి నగరపాలక సంస్థ కార్యాలయానికి రిపోర్ట్‌చేయాలని ఆయన ఆదేశించారు. బార్ నిర్వాహకులను పిలిపించి ప్రభుత్వ దుకాణాలైనా నిబంధనలు పాటించకపోతే లైసెన్స్‌లు రద్దుచేసేందుకు సిఫారసు చేస్తామని వెంకటరావు స్పష్టంచేశారు. దీంతో వ్యాపారులు వ్యర్థాలను తొలగించే చర్యలు చేపట్టారు.


బార్ నిర్వాహకులతో మాట్లాడుతున్న హెల్త్ ఆఫీసర్ వెంకటరావు


ముక్తుంపురం కొండ పోరంబోకు స్థలాన్ని పరిశీలిస్తున్న రంగయ్య

## ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే చర్యలు: ఆర్డీవో

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రణస్థలం: ప్రభుత్వ భూములు, కొండలను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో సీహెచ్ రంగయ్య హెచ్చరించారు. ఆ స్థలం మనదే ! అన్న కథనం సోమవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఈ మేరకు ఆర్డీవో రంగయ్య, తహసీల్దార్ రామారావు ముక్తుంపురం సర్వే నెంబరు 58లోని కొండ పోరంబోకు భూమిని బుధవారం పరిశీలించారు. కొండ దిగువ ప్రాంతంలో ఉన్న భూమిని ఎవరు చదున చేశారో ఆరా తీశారు. ప్రభుత్వం భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించేవారిపై బైండోవర్ కేసులు నమోదు చేయాలాని తహసీల్దార్ రామారావు ఆదేశించారు. ఈ స్థలం ప్రభుత్వ బోర్డులు ఏర్పాటు చేయమని ఆదేశించారు. ఆయనతో పాటు వీర్‌ఆర్‌ఏ గౌరినాయుడు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



## రైలు కింద పడి వ్యక్తి మృతి

పలాస: పలాస రైల్వే పోలీస్ స్టేషన్ పరిధి కిష్టుపురం రైల్వే గేటుకు సమీపంలో బుధవారం ప్రమాదవశాత్తు రైలు కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఒడిశా రాష్ట్రం గురండి గ్రామానికి చెందిన నల్ల తారకేశ్వరరావు(53) కుమార్తె వివాహానికి అవసరమైన దుస్తులు, వంట సామాన్లను కొనుగోలు చేసేందుకు వచ్చాడు. పట్టాలు దాటుతుండగా రైలుఢీకొని ఈ సంఘటన జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు.మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. రైల్వేఎస్‌ఐ షరీఫ్ కేసుననమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టంనిమిత్తం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

### ట్రాక్టర్ ప్రమాదంలో మహిళ..

నందిగాం: నందిగాం మండలం దిమ్మిడిజోలలో బుధవారం జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో మహిళ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దిమ్మిడిజోలకి చెందిన వివాహిత గౌడు జగదీశ్వరి (30) ఉపాధి పని నిమిత్తం ఇంటి నుంచి బయలుదేరి పని ప్రదేశానికి వెళ్లేందుకు ట్రాక్టర్ ఎక్కింది. అయితే ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి జారిపడిపోవడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందింది. అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్ పెసర చేను తీసుకు వచ్చేందుకు వెళ్తుండగా ఈమె ట్రాక్టర్ ఎక్కి ప్రమాదానికి గురైంది. మృతురాలికి భర్త దుర్యోధనరావు, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లాకేంద్రాసుపత్రికి తరలించారు. దుర్యోధనరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మహ్మద్ అమీర్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### అనంతపురం రోడ్డు ప్రమాదంలో పంగవానిపేట వాసి..

జలుమూరు: అనంతపురం జిల్లా పెద్దఒడుగూరు మండలం కాచేపల్లి టోల్ ప్లాజా సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జలుమూరు మండలం పంగవానిపేటకి చెందిన పంగ శ్రీనివాసరావు (43) మృతిచెందారు. గ్రామస్థుల కథనం మేరకు.. పశువులుతరలించే కంటైనర్ బుధవారం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కంటైనర్‌లో కూలీగా పనిచేస్తున్న శ్రీనివాసరావు మృతి చెందినట్లు సమాచారం వచ్చిందని కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కును కోల్పోవడంతో భార్యశ్రీదేవి, కుమారుడు, కుమార్తెలు రోదిస్తున్నారు.

### ఆర్టీసీ బస్సును లారీ ఢీకొని ముగ్గురికి గాయాలు

నందిగాం:మండలంలోని పెద్దబాణాపురం సమీపంలో హైవేపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం మేరకు..శ్రీకాకుళం నుంచి ఆర్టీసీబస్సు పలాస వెళుతూ ప్రయాణికులను ఎక్కించుకునేందుకు పెద్ద బాణాపురం వద్ద నిలిపారు. అదే మార్గంలో వెనుక నుంచి వస్తున్న లారీబస్సును ఢీకొనడంతో ఒక్కసారి బస్సు కుదుపులకు గురై ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. బస్సులో వెనుక కూర్చొన్న ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ సమయంలో బస్సులో 50 మంది ప్రయాణికులు ఉన్నారు. అయితే మిగిలిన వారికి ఎటువంటి ప్రమాదం కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఈ ఘటనలో నందిగాం మండలం చిన్నలవునిపల్లికి చెందిన కాశిరాము, ఆనందపురానికి చెందిన గొల్లపల్లి లతాశ్రీ, సారవకోట మండలం మద్రిపాడుకు చెందిన జన్ని ఉపేంద్రలకు తీవ్ర గాయాలయ్యాయి. వీరినిహైవే అంబు లెన్స్‌లో చికిత్స నిమిత్తం పలాస సామాజిక ఆసుపత్రికి తరలించారు. వీరిలో రాము పరిస్థితి ప్రమాదక రంగా ఉండడంతో ప్రథమ చికిత్స అనంతరం టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రికి రిఫర్ చేశారు. రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మహ్మద్ అమీర్ ఆలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ద్విచక్రవాహనాలు ఢీకొని నలుగురికి..

టెక్కలి రూరల్: తెంబూరు రోడ్డులోని వలియాసాగరం గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని నలుగురు గాయపడ్డారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. టెక్కలికి చెందిన కూన చంద్రశేఖర్,స్నేహితుడు బమ్మిడివినోద్ ద్విచక్రవాహనంపై సీతాపురం వైపు వెళ్తున్న క్రమంలో జీడిపేట గ్రామానికి చెందిన మంగపేట కృష్ణారావు, ఆనంద్ ఎదురుగా ద్విచక్ర వాహనంతో వస్తుండగా రెండు బైక్‌లు బలంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో టెక్కలికి చెందిన చంద్రశేఖర్, వినోద్‌లకు తీవ్రగాయాలు కాగా టెక్కలి జిల్లా ఆసుపత్రిలో ప్రథమచికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించారు. ఘటనలో గాయపడిన మరోఇద్దరు వ్యక్తులకు టెక్కలి జిల్లా ఆసుపత్రిలో చికిత్స అందించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు సీఐ పి.షైడయ్య తెలిపారు.

### రెండు ఆలయాల్లో చోరీ

టెక్కలి రూరల్: విక్రంపురంలోనిమంకినమ్మ ఆలయంతో పాటు ఉమారామలింగేశ్వరాలయంలో మంగళవారం అర్థరాత్రి దాటిన తరువాత గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ సిబ్బంది, గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మంకినమ్మ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు చొర బడి అమ్మవారికి చెందిన పుస్తెలతాడు, ముక్కుపుడక,కాసులు వంటి బంగారం ఆభరణాలు సుమారు 1.5 తులాలు, సుమారు 40 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. అదేవిధంగా గ్రామంలోని ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో కేజీన్నర వెండి ఆభరణాలతో పాటు హుండీ నగదు సుమారు రూ.40 వేలు చోరీకి గురైనట్లు బుధవారం గుర్తించారు. ఈ మేరకు ఆలయ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు, క్లూస్‌టీం ఆలయాల్లో ఆధారాలను సేకరించారు. రెండు చోరీలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పి.షైడయ్య తెలిపారు.

### రూ.17 లక్షల ఆన్‌లైన్ మోసం

శ్రీకాకుళం క్రైం: శ్రీకాకుళానికి చెందిన ఓ మహిళ ఆన్‌లైన్ యాప్ ద్వారా రూ.17 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయింది. టూటౌన్ పోలీసుల కథనం మేరకు.. స్థానిక ఫాజుల్‌భాగ్‌పేటకు చెందిన నంబాళ్ల గ్రీష్మిత వర్క్ ఫ్రమ్ హోమ్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా విధులు నిర్వహిస్తోంది. ఇటీవల క్రిప్టోకరెన్సీ ఆన్‌లైన్ యాప్‌లో పెట్టుబడులు పెడితే అధిక మొత్తంలో నగదు వస్తుందన్న ఆశతో దఫదఫాలుగా భర్తతో కలిసి పెట్టుబడిపెట్టింది. అయితే పెట్టుబడిలో డబ్బుల రాకపోగా సుమారు రూ 17.05లక్షలు నగదు పోగొట్టుకున్నాక తాను మోసపోయానని గ్రహించి సైబర్‌సెల్‌కు ఫిర్యాదుచేసింది. ఈ మేరకు బుధవారం టూటౌన్ సీఐ ఉమామహేశ్వరరావు గ్రీష్మిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

### శ్రీకాకుళంలో బాలుడి అదృశ్యం

శ్రీకాకుళంక్రైం:ఓబాలుడు అదృశ్యమైన సంఘటన శ్రీకాకుళంలో చోటుచేసుకుంది.టూటౌన్ పోలీసుల కథనం మేరకు..శ్రీకాకుళంలోని బలగ బండారి వీధికి చెందిన బాలుడు సాధు పృథ్వీరాజ్ పదోతరగతి చదువుతున్నాడు. ట్యూషన్ ఫీజుకోసం వెయ్యి రూపాయలు ఇవ్వాలని తల్లి రాధను పృథ్వీరాజ్ అడిగాడు. తల్లి రూ.500 ఇచ్చినా ట్యూషన్‌లో కట్టలేదు. ఈ విషయం తెలుసుకున్న తల్లి ఈనెల ఆరోతేదీన కొడుకును మందలించింది. అదేరోజు రాత్రి పదిగంటల సమయంలో ఇంటినుంచి బయటకు వచ్చిన పృథ్వీరాజ్ తిరిగిరాకపోవడంతో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో బుధవారం టూటౌన్ పోలీసులకు తల్లి రాధ ఫిర్యాదుచేసింది. సీఐ జి.ఉమామహేశ్వరరావు. కేసు నమోదు చేశారు.

## టైటిల్లింగ్ యాక్ట్ రద్దు చేయాలి

● మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ


మాట్లాడుతున్న అప్పలసూర్యనారాయణ

అరసవల్లి:ఏపీ టైటిల్లింగ్ యాక్ట్ రద్దుచేయాలని మాజీ మంత్రి, టీడీపీనాయకుడు గుండ అప్పలసూర్యనారాయణ కోరారు. టైటిల్లింగ్ యాక్ట్ రద్దు చేయాలని న్యాయవాదులు జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు ఆధ్వర్యంలో రిలేదీక్షను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెం టనే రద్దుచేస్తామని తెలిపారు. అసోసియేషన్ కార్యదర్శి పొన్నాడ రాము, న్యాయ వాదులు భవానీప్రసాద్, కట్ట పార్థసారథి, కొండాల సూర్యనారాయణ, పీవీ రవిదీక్షలో కూర్చొన్నారు. కార్యక్రమంలో బార్‌కౌన్సిల్ సభ్యుడు గేదెల వాసు దేవ రావు, వాన కృష్ణచంద్, కూన రాజారావు, సనపల హరి, కూన అన్నంనా యుడు, ఆగూరు ఉమామహేశ్వరరావు, కె.శ్యాంసుందర్, పాడి సీతంనాయుడు, రమణ దయాల్, చౌదరి లక్ష్మణరావు, పి.రాజేశ్వరరావు, జె.రాజారావు, కోట శ్రీని వాస రావు, కె.రాజా, దుర్గారావు గాంధీ, కొత్తకోట అమ్మినాయుడు, సువ్వారి తవిటి నాయుడు, ఖగేంద్ర, ఎస్.వెంకట్రావు, సంపత్‌రావు, అనిల్‌కుమార్, బొత్స సుదర్శ నరావు పాల్గొన్నారు.

## అవినీతి ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలి

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రామ్‌మల్లిక్‌నాయుడు


బాతువలో పర్యటిస్తున్న రామ్‌మల్లిక్ నాయుడు

జి.సిగడాం:అవినీతి ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పి బంగాళాఖాతంలో కలపాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రామ్‌మల్లిక్‌నాయుడు పిలుపునిచ్చారు. బాతు వలో ఇటీవల మృతి చెందిన కార్యకర్త కూనుబిల్లి మల్లేశ్వర రావు కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. అనంతరం గ్రామస్థుల సమస్యలపై ఆరాతీసి మాట్లాడారు. రాష్ట్రానికి సీఎం జగన్మోహన్‌రెడ్డి శనిలా దాపరించాడని, ఆ శనిని త్వరగా వదిలించుకోవాల న్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కూనుబిల్లి కూర్మారావు, కుమరాపు రవికుమార్, కుదిరెళ్ల బుజ్జి, బాలి తమ్మినాయుడు ఉన్నారు.

## ఓటమి భయంతో వైసీపీ తప్పుడు ప్రచారం

● శ్రీకాకుళం నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్

అరసవల్లి: ఓటమి భయంతో వైసీపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని టీడీపీ నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ ఆరోపించారు. బుధవారం శ్రీకా కుళంలో ఆయన విలేకరులతో మాట్లాడు తూ తమ పార్టీ ప్రకటించిన సూపర్‌సిక్స్ సంక్షేమ పథకాలే కాకుండా టీడీపీ-జనసేన ఉమ్మడి మేనిఫెస్టో ద్వారా మరిన్ని సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. వైసీపీ ఓడిపోతే పోయేది వారి పదవులే తప్ప పథకాలుకావన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు టీడీపీని గెలిపించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ నాయకులు మళ్లీ ప్రభుత్వం రాకపోతే సంక్షే మ పథకాలు ఆగిపోతాయని తప్పుడు ప్రచారంతో ప్రజలను అయోమయానికి గురుచేసే ప్రచారం చేస్తున్నారని, వీటిని నమ్మవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు.

## ఫిర్యాదుల అధ్యయనానికి మూడు కమిటీలు

● బీఆర్‌ఏయూ వీసీ రజని అధికారులతో సమీక్ష

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్‌అంబేడ్కర్‌యూనివర్సిటీలో ఇటీవల వచ్చిన ఫిర్యాదులు, నియామకాలపై అధ్యయనానికి, విచారణకు మూడు కమిటీలను నియమించామని వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని తెలిపారు. ఈమేరకు బుధవారం వర్సిటీలో ఇటీవల వచ్చిన ఫిర్యాదులపై అధికారులతో ఆమె సమీక్షించారు. అవుట్ సోర్సిం గ్‌విధానంలో నియమించిన తాత్కాలిక ఉద్యోగుల అంశంపై వర్సిటీ సైన్స్ కళా శాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ అధ్యక్షతన కమిటీని నియమించారు. వర్సిటీ ఏర్పాటు నుంచి ఇప్పటివరకు జరిపిన నియామకాల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించారాలేదా అన్నఅంశాన్ని డీన్ డాక్టర్ మురపాన అనూ రాధ అధ్యక్షతన మరోకమిటీని నియమించారు.గతఏడాది జూన్ 30న వర్సిటీలో బోధన సేవల నుంచి నిలుపుదల చేసిన కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, టీచింగ్ అసోసియేట్స్, టీచింగ్ అసిస్టెంట్స్ సమస్య పరిష్కారానికి ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.స్వప్నవాహిని అధ్యక్షతన మరో కమిటీని నియమించారు. ఈ కమిటీలు వారికి నిర్దేశించిన అంశాల్లో అధ్యయనం చేసి పదిరోజుల్లో నివేదిక అందజేయాల్సి ఉంటుందని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అడ్డయ్య తెలిపారు.

### ఎన్నికల విధులు విజయవంతంగా నిర్వహించాలి

కలెక్టరేట్: ఎన్నికల విధులు విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ మంజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. స్థానిక జడ్పీసమావేశం మందిరంలో సార్వత్రికఎన్నికలు-2024కు సంబంధించి మాస్టర్‌ట్రైనర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పోలింగ్‌కు ముందు మాక్ పోల్ నిర్వహించాలన్నారు. మెప్మా పీడీ, జిల్లా మాస్టర్ ట్రైన్ కిరణ్‌కుమార్ పోలింగ్‌స్టేషన్లలో ఏర్పాట్లు, ప్రిసైడింగ్‌అధికారి డైరీపై వివరించారు. పోస్టల్‌బ్యాలెట్‌పై డ్వామా పీడీ చిట్టిరాజు, అవగాహనకల్పించారు. కార్యక్రమంలో ఇన్ చార్జి డీఆర్వో రామమోహనరావు, ఆర్డీవో భరత్ నాయక్, ఉప కలెక్టర్లు పద్మావతి, అప్పారావు పాల్గొన్నారు.

### ద్విచక్ర వాహనం చోరీ

శ్రీకాకుళంక్రైం:శ్రీకాకుళంలోని రెల్లవీధి బాలురహాస్టల్‌లో కుక్‌గా పనిచేస్తున్న ఇందిరానగర్‌కాలనీకి చెందిన చింతాడ కృష్ణ ద్విచక్రవాహనం చోరీకి గురయ్యింది.టూటౌన్ సీఐ జి.ఉమామహేశ్వరరావు కథనం మేరకు.. ఈనెల నాలుగో తేదీ ఉదయం ఆరు గంటలకు హాస్టల్‌లో వంట చేసేందుకు వెళ్లాడు. హాస్టల్ బయట పార్క్‌చేసిన తన ద్విచక్రవాహనాన్ని తిరిగి మధ్యాహ్నం 12 గంటలకు వెళ్ళిచూసేసరికి వాహనం కనిపించలేదు. దీంతో కృష్ణ అన్నిచోట్ల తన వాహనాన్ని వెతికినా దొరకకపోవడంతో బుధవారం రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

### మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఇచ్ఛాపురం రూరల్:ధర్మపురానికి చెందిన ఉప్పాడసోమేష్ రెడ్డి కుటుంబానికి పోలెండ్‌లో శ్రీకాకుళం తెలుగుసంఘం అండగా నిలిచింది.ఈమేరకు సోమేష్ రెడ్డి పోలెండ్‌లో కూలి పనికి వెళ్లి గతఏడాది డిసెంబరు 16న మృతిచెందాడు. ఆయనపోలెండ్‌లోని శ్రీకాకుళం తెలుగుసంఘసభ్యుడు వసంతరెడ్డి ఆధ్వర్యంలో 1.50లక్షలు సేకరించారు.ఈమేరకు ఆమొత్తం బుధవారం కుటుంబ సభ్యులకు అందించి పిల్లల పేరున పోస్టాఫీసులో డిపాజిట్ చేశారు. సుకన్య యోజన పథకం రూపంలో కుమార్తె కావ్యశ్రీ పేరున రూ. 1.50 లక్షలు డిపాజిట్ చేశారు.

## ప్రభుత్వానికి తడాఖా చూపిస్తాం

● సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గొండు శంకర్


మాట్లాడుతున్న శంకర్

అరసవల్లి: అసెంబ్లీ ముట్టడి ప్రారంభం మాత్రమేనని, ముందు ముందు జగన్ ప్రభుత్వానికి సర్పంచ్‌ల తడాఖా ఏమిటో చూపిస్తామని ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్ హెచ్చరించారు. బుధవారం శ్రీకాకుళంలో విలేకరులతో మాట్లాడుతూ 3.5 కోట్ల గ్రామీణ ప్రజల సమస్యలు పరిష్కారమయ్యే వరకూ రాజీలేనిపోరాటాలు చేస్తామన్నారు.ఉద్యమాలను ఉధృతం చేసి జగన్ ప్రభుత్వాన్ని లొంగదీస్తామన్నారు. వందలాది మంది సర్పంచ్‌లు పోలీసు అక్రమ అరెస్టులను దాటుకుని చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేశారని తెలిపారు. నవ్యాంధ్రప్రదేశ్‌లో చరిత్రలో అసెంబ్లీ గేటు వరకు వెళ్లి నిరసన ప్రదర్శన నిర్వహించిన మొట్టమొదటి సంఘం సర్పంచ్‌ల సంఘమని తెలిపారు. జగన్‌రెడ్డి ప్రభుత్వం రెండురోజుల ముందు నుంచి సర్పంచ్‌లను హౌస్ అరెస్టులకు పాల్పడినా వారి ఉద్యమ స్ఫూర్తి ముందు అవి నిలబడలేదని చెప్పారు.

### పొరపాట్లు పునరావృతం కారాదు: ఎస్పీ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి రథసప్తమి వేడుకల్లో గత ఏడాది జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఎస్పీ జీఆర్ రాధిక కోరారు. బుధవారం ఈనెల 16న జరగనున్న రథసప్తమి వేడుకలకు సంబంధించి క్యూలైన్ల ఏర్పాటు, ప్రత్యేక, వీఐపీ దర్శనం, వాహనాల పార్కింగ్ తదితర విషయాలను పోలీసు అధికారులతో అరసవల్లిలో పరిశీలించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మతో ఏర్పాట్లపై చర్చించారు. గత ఏడాది దర్శనాల క్యూలైన్లలో ఏయే పాయింట్ల వద్ద భక్తులు ఇబ్బం దులు ఎదుర్కొన్నారో వాటిని పరిశీలించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వేలాదిమంది భక్తులకు స్వామి దర్శనం సజావుగా జరిగేలా దర్శనం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎస్పీ ప్రేమ్‌కాజల్, డీఎస్పీ శృతి, సీఐ ఎల్.సన్యాసినాయుడు, ట్రాఫిక్ సీఐ అవతారం, ఎస్ఐ బలివాడ గణేష్, ఆలయ జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### బీసీల్లో చేర్చే వరకూ పోరాటం

జి.సిగడాం:తెలగ కులస్థులను బీసీల్లో చేర్చే వరకు తమ పోరాటం ఆగదని ఉత్తరాంధ్ర తెలగసంక్షేమ సంఘం నాయకుడు, బీసీ సాధన సమితి అధ్యక్షుడు పల్లంట్ల వెంకట రామారావు తెలిపారు. బీసీ సాధనలో భాగంగా ఇచ్ఛాపురం నుంచి ఆయన ప్రారంభించిన తెలగ కుల ఆత్మగౌరవ యాత్ర జి.సిగడాం మండలంలోని సంతవురిటి బుధవారం చేరుకుంది. మాజీ ఎంపీపీ బాలబొమ్మ మహాలక్ష్మి ఇంటివద్ద విలేకరులతో మాట్లాడారు. పాదయాత్రకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు, పొందూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ కలిశెట్టి అప్పలనాయుడు సంఘీభావం తెలిపారు. కార్యక్రమం లో తెలగ సంఘ నాయకులు బాలబొమ్మ వెంకటేశ్వరరావు, పలిశెట్టి సూర్యనారా యణ, దారబోయిన ధర్మారావు, గర్లంకి శ్రీనివాసరావు, కాయల రమణ మాష్టా రు, సీహెచ్ ఆర్‌కే రంగారావు, దౌలూరి వెంకటరమణ, బి.సన్యాసిరావు, బత్తుల నాని, మానం సత్యారావు, మహదాశ్యం చిన్నారావు, ఆరెళ్ల గొల్లాజీ, కోన వెంకటరావు, జక్కంపూడి దాసు పాల్గొన్నారు.

### ప్రతి మహిళ కుటుంబానికి సహాయపడాలి

రణస్థలం:ప్రతిమహిళ ఆర్థికంగా అభివృద్ధి చెంది, కుటుంబానికి సహాయపడాలని నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి కె.వరప్రసాద్‌కుమార్ కోరారు. బుధవారం స్థానక వేంకటేశ్వరకాలనీలో నాబార్డు సహకారంతో బెజ్జిపురం యూత్ క్లబ్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలతో ఆహార పదార్థాల తయారీపై శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. శిక్షణపొందిన మహిళలు యూనిట్‌గా ఏర్పడితే డీసీసీబీ బ్యాంకు నుంచి రుణాలు ఇవ్వనున్నట్లు ఆ బ్యాంకు మేనేజర్ ప్రచూణ తెలిపారు. కార్యక్రమంలో బెజ్జిపురం యూత్‌క్లబ్ అధ్యక్షుడు ఎం.ప్రసాదరావు, కె.భాగ్యలక్ష్మి, ఎన్.శ్రీను పాల్గొన్నారు.

## కార్యకర్తలే పార్టీకి బలం: కూన


పైడిలింగాన్ని పరామర్శిస్తున్న రవికుమార్

పొందూరు: కార్యకర్తలే పార్టీ బలమని, వారికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ తెలిపారు. పొందూరు పంచాయతీ మాజీ సర్పంచ్, వ్యాపారి కాకర్ల పైడిలింగం సతీమణి ఇటీవల మృతిచెంద డంతో గురువారం ఆయన్ను రవికుమార్ పరామర్శించారు. అలాగే పట్టణంలో టీడీపీ కార్యకర్తల కుటుంబాలను కూడా పరామర్శించారు. ఆయన వెంట పార్టీ పట్టణాధ్యక్షుడు ఎ.చినరంగ ఉన్నారు.

### సైనిక లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు

గార: మధ్యప్రదేశ్‌లో సోమవారం మృతిచెందిన ఐటీబీపీ జవాన్ దుంగ రాంబాబు మృతదేహానికి స్వగ్రామం సిమ్మపేటలో బుధవారం సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. ఐటీబీపీ ఇన్‌స్పెక్టర్ రాకేష్ శర్మ, అనంతపురం యూనిట్ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, గార ఎస్ఐ కె.కృష్ణప్రసాద్ గౌరవవందనం చేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### ఆక్సిజన్ అందుబాటులోఉండాలి

ఇచ్ఛాపురం: రోగులకు అవసరమైన మందులతోపాటు ఆక్సిజన్ అందుబాటులో ఉండాలని 108 అంబులెన్స్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ జి.జగన్నాథరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఇచ్ఛాపురంలో 108 వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది గోవింద్, సూరిబాబు, బాలకృష్ణ, కృష్ణ పాల్గొన్నారు.

### జిల్లాలో 283 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ

ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం: ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 283 ఉపాధ్యాయ పోస్టులు మాత్రమే ఖాళీ ఉన్నట్లు నోటిఫికేషన్ ప్రభుత్వం డీఎస్సీ నోటిఫికేషన్‌లో బుధవారం ప్రకటించింది. ఈ మేరకు ఎస్జీటీ పోస్టులు 104, స్కూల్ అసిస్టెంట్లు 130, టీజీటీ పోస్టులు 49 చూపించారు.

### నేడు బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ రాక

అరసవల్లి:జిల్లాకు గురువారం బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావు, సభ్యులు గొండు సీతారాం రానున్నారు. ఈ సందర్భంగా వారు బాలలహక్కులు, వారి సంక్షేమానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించనున్నారు. ఈనెల 16న జరిగే రథసప్తమి వేడుకల్లో బాలలకు కల్పించనున్న వివిధ సదుపాయాలపై అధికారులతో సమీక్షిస్తారు.

### మొరాయిస్తున్న సర్వర్లు.. నత్తనడకన రిజిస్ట్రేషన్లు

శ్రీకాకుళంక్రైం:శ్రీకాకుళం రిజిస్ట్రార్‌కార్యాలయంలో సర్వర్లు మొరాయిస్తున్నాయి. దీంతో ఇక్కడ రిజిస్ట్రేషన్లు నత్తనడకన సాగుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వస్తున్న స్థల విక్రయదారులు రిజిస్ట్రేషన్లు కాకపోతుండడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. థంబ్ ఇంప్రెషన్‌సైతం కాకపోవడంతో రిజిస్ట్రేషన్లకు తిరగాల్సివస్తోందని క్రయవిక్రయదారులు వాపోతున్నారు.కాగా సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ల వల్ల సర్వర్లు నెమ్మదిగా పనిచేస్తున్నాయని జిల్లా రిజిస్ట్రార్ మన్మథరావు ఆంధ్రజ్యోతికి తెలిపారు.

## రేపు శ్రీకాకుళంలో జాబ్ మేళా

అరసవల్లి:శ్రీకాకుళంలోని ప్రభుత్వాసుపత్రి జంక్షన్‌లో గల వద్ద గల డీఎల్‌టీసీలో ఐటీఐ దగ్గర జిల్లా ఉపాధిఅధికారి ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లాఉపాధి అధికారి కె.సుధ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు తీసుకుని హాజరుకావాలని కోరారు.

### 12న పీఎం జాతీయ అప్రెంటీస్ మేళా

ఎచ్చెర్ల:ఎచ్చెర్లలోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 12న ప్రధానమంత్రి జాతీయఅప్రెంటీస్ మేళాను నిర్వహించనున్నట్లు జిల్లా అడ్మిషన్ల కన్వీనర్, ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఆ రోజు ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమయ్యే అప్రెంటీస్‌మేళాలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో వివిధ ట్రేడ్‌ల్లో శిక్షణ పూర్తిచేసి ఉత్తీర్ణులైన అభ్యర్థులు మూడు బయోడేటాలు, పదోతరగతి, ఐటీఐ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలతో హాజరుకావాలని కోరారు.

### 20న శ్వేతగిరి జాతర

గార: శాలిహుండాం (శ్వేతగిరి) కొండపై వెలసిన కాళీయ మర్దనవేణుగోపాలస్వామి జాతర ఈనెల 20న జరగనుందని ట్రస్ట్ ఛైర్మన్ సుగ్గు మధురెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆలయ ప్రాంగణంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భీష్మఏకాదశి పురస్కరించుకుని ఈనెల 20న శ్వేతగిరిపై స్వామివారి తిరువీధి, వంశధారనదిలో చక్రస్నానం జరుగుతాయని తెలిపారు. 24నవేణుగోపాలస్వామి కల్యాణం నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ ఛైర్మన్ గొండు కృష్ణమూర్తి, జడ్పీటీసీ మార్పు సుజాత, సర్పంచ్‌లు మార్పు దుర్గా పృధ్వీరాజ్, పీస శ్రీహరి, నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీ రామకృష్ణ పాల్గొన్నారు.

### నేడు చిత్ర యూనిట్ రాక

శ్రీకాకుళంక్రైం:శ్రీకాకుళంలోని ఎస్వీసీ థియేటర్‌లో ప్రదర్శిస్తున్న అంబాజీపేటమ్యారేజిబ్యాండ్ చిత్రం యూనిట్ సభ్యులు గురువారం మ్యాట్నీషోలో ప్రేక్షకులను కలుసుకోనున్నారని థియేటర్ మేనేజర్ బి.రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభిమానులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్‌కు అభినందన

ఎచ్చెర్ల: న్యూఢిల్లీలో గణతంత్ర వేడుకల పరేడ్‌లో పాల్గొన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ విద్యార్థిని, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీరు బమ్మిడి రంజనిని బుధవారం వీసీ ప్రొఫెసర్ కేఆర్‌రజని అభినందించారు. రంజని రాష్ట్రపతి, ప్రధాని తదితరులతో భేటీ అయిన బృందంలో కూడా ఉన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త మురపాన అనూరాధ పాల్గొన్నారు.

### రమాబాయికి నివాళి

గుజరాతీపేట: బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి సేవలు స్ఫూర్తిదాయకమని అంబేడ్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర సైనిక్ కన్వీనర్ తైక్వాండో శ్రీను తెలిపారు. రమాబాయి జయంతి పురస్కరించుకుని శ్రీకాకుళంలోని మహాత్మ జ్యోతిరావు పూలే పార్క్‌లోని ఆమె విగ్రహానికి ఏఐఎం నాయకులు బుధవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలోఎస్.రమణ, పురుషోత్తం, రాంబాబు, ఎన్.అప్పారావు, ఎ.రాజు, పి.మహేష్, ఎస్.సంతు, పి.చంటి పాల్గొన్నారు.● సోంపేట :సోంపేట జైభీమ్ సేన కార్యాలయంలోమాతారమాబాయి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జైభీమ్‌సేన జిల్లా అధక్షుడు ఎ.బుష్క, ఈశ్వరరావు, ప్రధానకార్యదర్శి డి.వెంకటరావు పాల్గొన్నారు.

### ఈపీఎస్ పెన్షనర్ల రిలే దీక్ష

అరసవల్లి: స్థానిక జ్యోతిరావు పూలే పార్కు వద్ద తమ సమస్యలను పరిష్కరించాలనిఈపీఎస్ పెన్షనర్లు నిర్వహిస్తున్న రిలేదీక్షలు బుధవారం మూడోరోజుకు చేరుకున్నాయి. ఈసందర్భంగా సీపీఐ నాయకుడు పి.తేజేశ్వరరావు మాట్లాడుతూ ఈపీఎస్ ఒక్కరోజు పని చేసినా సరే ఎమ్మెల్యే, ఎంపీలకు జీవితకాలం పాటు పెద్దమొత్తంలో పెన్షన్,ఇతర సదుపాయాలు లభిస్తున్నాయని, కానీ దశాబ్దాల పాటు సేవలందించిన వారికి మాత్రం కనీసం వెయ్యి రూపాయలు కూడా పెన్షన్ రానివారు దేశంలో లక్షలాది మంది ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో పి.గోపాలరావు, పి.సత్యనారాయణ, వి.ధర్మయ్య పాల్గొన్నారు.

### సరుబుజ్జిలిలో బాబు ష్యూరిటీ

సరుబుజ్జిలి: సరుబుజ్జిలి పంచాయతీలో బుధవారం తెలుగు యువత ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీకార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా నాయకులు కొమనాపల్లి రవికుమార్, దవళ సింహాచలం, వెంకటరమణ, ఇల్లాకుల ప్రభాకర్ ఆధ్వర్యంలో మన ఆమదాలవలస-మన రవన్న అన్న స్టిక్కర్లను మొబైల్ ఫోన్లపై అతికించారు.

### సమ్మె విజయవంతం చేయాలి

అరసవల్లి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అన్ని కార్మిక, రైతుకూలీ సంఘాలు, కిసాన్‌మోర్చా ఉమ్మడిగా పిలుపునిచ్చిన దేశవ్యాప్త పారిశ్రామిక సమ్మె, గ్రామీణబంద్ విజయవంతం చేయాలని సంఘాల సమన్వ యకర్త తాండ్ర ప్రకాష్ కోరారు. ఈ మేరకు బుధవారం శ్రీకాకుళంలోని క్రాంతి భవన్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో రైతుసంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పి.చంద్రరావు, కె.మోహనరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.సింహాచలం పాల్గొన్నారు.